# పెండ్యులమ్

● చిత్తూరి కోటేశ్వరరావు ఐ.పి.ఎస్. ●

## కాల్పులు... కాల్పులు... ఎదురు కాల్పులు... పోలీసు జీపులు గ్రామాల్లో తెగతిరుగుతున్నాయి.

గ్రామాలచుట్టూ పోలీసు పహరా ఎక్కువైంది. నిన్న కారెగట్టులో, నేడు చెలక దగ్గర ఎదురు కాల్పులు... ప్రతిరోజు ఎప్పుడో ఒక్కసారి ఒక చోట ఎదురు కాల్పులు... కాల్పులు... ఎదురు కాల్పులు...వర్గపోరాటం.

గడచిన పావు శతాబ్దిగా కీకారణ్యం నిరంతరం కీచులాడుతూనే ఉంది. పల్లెలు వల్లకాడవుతున్నాయి. గూడేలు తగులబడుతున్నాయి. అమాయక ప్రజలు ప్రాణాలను గుప్పిట పెట్టుకొని పరుగులిడుతున్నారు. పారిపోతున్నారు. గమ్యం ఎవరికీ తెలియడం లేదు.కాల్పులలో... ఎదురు కాల్పులలో ... మానవజీవాలు హరీమంటున్నాయి. దిక్కుమొక్కులేని మనుషుల కళేబరాలకోసం రాబందుల రెక్కలచప్పుడు మృత్యుహేల. అయితే ఈ వర్గపోరాటంలో సాధించినది ఏమిటి? మానవ మారణహోమానికి ఫలితం ఏమిటి? కల్లోలం, మానవతకు చరమగీతి......

అశాంతి, అలజడి, అరాచకం, తుపాకుల ధ్వని, ప్రతిధ్వని, తిరుగుబాటు ఆ తిరుగుబాటు మీద తిరుగుబాటు నరహంతకుల కరాళనృత్యం.

గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఉదయించడానికి సూర్యుడు సయితం సంశయిస్తున్నాడు. తొంగి చూడడానికే చంద్రుడు భీతిల్లుతున్నాడు. ఒకవైపున తీవ్రవాదుల ప్రచండ విజృంభణ మరొకవైపు పోలీసుల పహరా పటాలం. తుపాకీ తూటాలు అవ్వాయి చువ్వాయిగా, బాంబులే టపాకాయిలుగా చలామణి అవుతున్న వేళ.....

శంకరం మాష్టారు ఆత్మ విమర్శన చేసుకుంటున్నారు. ఆయన ఆత్మావలోచనలో అన్ని అనవసర దృశ్యాలే కనిపిస్తున్నాయి. అపస్వరాలే వినవస్తున్నాయి. శంకరం మాష్టారు ఒకానొక రాజకీయ పార్టీ కార్యకర్త. ఆ పార్టీ క్రమ క్రమంగా ప్రజలలో పలుచనైపోతున్నది. పార్టీ నిర్లక్ష్యంవల్ల యువత, నిర్వీర్యమైపోతున్నది. ఆత్మవిశ్వాసం అంతరిస్తున్నది. చైతన్యం స్థానే జడత్వం ఆవహిస్తున్నది. పార్టీ సుస్థిరంగా ఉందని చెప్పుకొనేందుకు అమాయకులను అంతమొందించి కారణాలు వేరుగా చెప్పుతున్నారు. నిర్వీర్యమవుతున్న యువతను "ఎక్షన్" పేరుతో పిచ్చి పిచ్చిగా అనాగరిక కృత్యాలు చేయిస్తున్నది పార్టీ.

ప్రజల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావాలి. వ్యవస్థ పునాదులలో వున్న అజ్ఞానాన్ని పెకిలించి ఆ స్థానంలో ఆత్మ స్థైర్యాన్ని ప్రతిష్టించాలి. మానవతకు పట్టాభిషేకం చేయాలి. అంటే.... మనుషులను మార్చాలి ఒక నూతన సృష్టి జరగాలి. విజ్ఞాన విపంచికలు విహరించాలి. క్రొత్త మనిషి అవతరించాలి.

ఈ పరమధ్యేయంతో వరంగల్లు నుండి బయలుదేరారు శంకరం మాష్టారు పాల్వంచనుంచి ఒక రోజులో ప్రయాణించి 'బంగారు చెలక' గ్రామానికి చేరుకున్నారు. వెంట భార్య, బిడ్డ.

●●●

**పార్టీ నిర్లక్ష్యంవల్ల యువత నిర్వీర్యమై పోతోంది.**

●●●

అది గిరిజన గ్రామం, ఆయన ఉపాధ్యాయుడు.

రేయింబవళ్ళు శ్రమించారు, పరిశ్రమించారు, అవిరళమైన కృషిచేశారు.

శంకరం మాష్టారు పుణ్యమా అంటూ ఆ వూళ్ళో అక్షరజ్యోతి వెలిగింది.

అది చిరుదీపమే కావచ్చు. చీకటి గమ్యాన్ని చెరిపివేస్తున్నది.

అష్టకష్టాలను అనుభవిస్తూనే అవరోధాలను ఎదుర్కొంటునే ఆ గ్రామంలోని పిల్లలనందరిని చేరదీయగలిగారు శంకరం మాష్టారు. నిరక్షర కుక్షలతో అక్షరభ్యాసం చేయించారు.

అందరూ చదువుకోవాలి. చదువుతోపాటే సంస్కారం అబ్బుతుంది. సంస్కృతి పరిడవిల్లుతుంది. నేటి బాలలే రేపటి పౌరులు. వీరు పెరిగి విద్యాబుద్ధులు గడిస్తారు. కొత్తతరం, కొత్త రక్తం, సరికొత్త సమాజం. కక్షలు, కార్పణ్యాలు ఈర్ష్యా ద్వేషాలు, వర్గపోరాటాలు నేటి మానవలోకం ఆవిర్భవిస్తోంది. ఇదీ శంకరం మాష్టారి ఆలోచన. ఇది ఆయన తపన. ఇందుకే తపస్సు. ఆయన ఆశాజీవి. గుండె గుండెనా పగలు శగలుస్థానే ప్రేమాభిమానాలు వెల్లివిరియాలి...

ఆ రోజు.... ఆయన ననవాదులు తెగిపోయిన రోజు. మిట్ట మధ్యాహ్నాపు మార్తాండుడు చండప్రచండంగా మండిపడుతున్నరోజు...

శంకరం మాష్టారి చుట్టు గిరిజన పెద్దలు కొందరు మూకుమ్మడిగా గూడారు.

ఇదుగో పంతులూ ఏంది కథ. మా పిల్లకాయిల్ని చెడగొడుతున్నావ్? మా బిడ్డలు చదువుకుని

ఉద్యోగాలనీ, వూళ్ళేలాలని మా వూరి నుంచి ఎళ్లిపోయారనుకో... మా గతేంకాను? మా పొట్ట నిండేదెట్టా. పూట గడిచేదెట్టా? మా కామందుల పశువులు కాసేదెవరు? మా దొరల కమతంలో పనులు చేసేదెవరు?

మరునాటి నుంచి ఒక్క పిల్లోడు బడికి రాలేదు. హతాశుడయ్యాడు శంకరం మాష్టారు. వాళ్ళకు నచ్చచెప్పడానికి శతథాయత్నించాడు. పైగా, ఆ వయోజనులు కూడా విద్యావంతులు కావలెనంటు అందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తానన్నాడు. ఆవేదన చెందాడు. ఆక్రోశించాడు. ఆయన గోడు రాతిమీద వానచినుకు అయింది.

అసలు కీలకం ఎక్కడ వున్నదో కనిపెట్టగలిగారు శంకరం మాష్టారు. ఆదరాబాదరా వెళ్ళి గ్రామంలోని భూస్వాముల కాళ్లవేళ్ళా పడ్డాడు.

ముక్కు పచ్చలారని పిల్లలకు నేను విప్లవ పాఠాలు చెప్పడంలేదు. తిరుగుబాటు చేయమని పురిగొల్పడంలేదు. మనుషులుగా నాగరికతతో ఎలా బ్రతకవచ్చునో నేర్పుతున్నాను. అంతే వాళ్ళకు కాస్త అక్షరం ముక్కవస్తే మీకే మంచిది అంటూ నెత్తి నోరూ బాదుకుంటూ చెప్పుకున్నాడు.

★ ★ ★

అక్కడకు అదే పెద్ద పండుగ అయింది శంకరం మాష్టారుకి.

ఆయనకు ఏనుగంత బలం, గుట్టమంత సత్తువ వచ్చింది.

ఇహ విజృంభించారు.

శంకరం మాష్టారి మంచితనం, మమత, విజ్ఞత, విజ్ఞానం, పట్టుదల కృషి, వ్యక్తిత్వం, వైశిష్ట్యం విలువలు పలువలుగా గిరిజన గ్రామీణ ప్రాంతాలలో మారుమ్రోగింది. కొండలలో కోనలలో ప్రతిధ్వనించింది.

చీమలు దూరని చిట్టడవులలో కాకులు ఎగురని కారడవులలో గల తీవ్రవాదుల దృష్టిలో శంకరం మాష్టారు నిలిచారు.

★ ★ ★

శంకరం మాష్టారుకు అంతా అగమ్యగోచరంగా వుంది.

మాష్టారూ మీరు మాకు నచ్చారు. మాకు నాయకుడులేడు. మా దళానికి మీరే నాయకత్వం వహించాలి. మమ్ము నడిపించాలి. మీకు, మీ కుటుంబానికి ఏ లోపం లేకుండా చూసే బాధ్యత మీద పూర్వక్రమంలో మీరు ఒకపార్టీ కార్యకర్త అని కూడా మాకు తెలుసు. కనుక మా రాజకీయ విమోచనోద్యమానికి మాకు ఊతం ఇవ్వండి. వ్యూహరచన చేయండి. నాలు అని తీవ్రవాదులు

●●● అవరోధాలను ఎదుర్కొంటూనే గ్రామంలోని పిల్లల్ని చేరదీయ గలిగారు మాష్టారు. ●●●

చెప్పారు. పదే పదే విశదీకరించారు.

అది సాధ్యంకాని పని, నా చిత్త ప్రవృత్తికే పూర్తిగా విరుద్ధమైన పని. మారుమూల గిరిజనులకు గ్రామాలలో ఇంటింటా అక్షర జ్యోతిని వెలిగించి, ఉత్తమ భారత పౌరులుగా తీర్చిదిద్దడమే నా జీవితాశయం. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు



నేను ఆమడ దూరం. మీరు కూడా ఈ అరాచక పాప పంకిలం నుండి బయటపడి జనజీవన ప్రవంతిలో కలవండి. భ్రమలు, భ్రాంతులు వద్దు. ఎంత కాలమని అజ్ఞాతంగా వుంటారు మీరు? వర్గపోరాటం కాదు కావలసింది, మానసిక విప్లవం. విధ్వంసం కాదు కావలసింది, సాంఘిక పునరుజ్జీవనం. దౌర్జన్యాలను దుందుడుకు చర్యలను సహించారు. ప్రతిఘటించడానికి సమాయత్తులవుతారు. తుపాకి గొట్టం ద్వారా.

"ఉదయించే సూర్యకాంతిని అరచేతిలో ఆపలేరు మాష్టారూ. ఈ భూస్వామి పెత్తందారీ వ్యవస్థను నాశనంచేసి మేము ఎప్పటికైనా సరే అధికారంలోకి వస్తాము" స్పష్టీకరించారు తీవ్రవాదులు.

"చూడండి మాష్టారు — మీరు మళ్ళీ మీ ఇంటికి వెళ్ళే సమస్యేలేదు. మీ భార్య బిడ్డల విషయం మేం చూసుకుంటాం. మీరు మాకు నాయకత్వం వహించి తీరాలి. మా విప్లవకర వీరోచిత సిద్ధాంతాలను మీరు ప్రజలకు తెలియజేస్తుండాలి. ప్రజల సానుభూతి మా పట్ల మొగ్గేటట్టు మీ ప్రతిభా ప్రవృత్తులను వినియోగించి కృషిచేయాలి. నేటినుంచి మా పోరాటాలలో మీరు భాగస్వాములు. మీరే మా నాయకులు, మీరే బాధ్యులు.

తీవ్రవాదుల దృఢ నిర్ణయానికి మాన్పడిపోయారు శంకరం మాష్టారు తన ప్రమేయం మేరనే, తన ఇష్టంలేకనే తన మనస్తత్వానికి విరుద్ధంగా సిద్ధాంతానికి వ్యతిరేకంగా....

మరునాటి తెల్లవార ఝామునే నావారంలో బంగార్రాజును పట్టుకున్నారు తీవ్రవాదులు. బంగార్రాజు ఆ చుట్టుపక్కల గిరిజన గూడేలలో గల పెద్ద భూస్వాములలో ఒకడు కాక, వడ్డీవ్యాపారి. వడ్డీ వ్యాపారంలో అతనిని మించిన వారు లేరని ప్రతీతి.

బంగార్రాజు తలకు వెలకట్టి తెగనరికేశారు తీవ్రవాదులు.

తన కళ్ళముందే జరిగిన నరమేధాన్ని చూస్తూ శంకరం మాష్టారు విశ్చేష్టులయ్యారు.

హింసావాదానికి పరాకాష్ఠ మనిషి మనిషినే నిలువునా తెగటార్చడం...

మూగగా రోధించింది ఆయన మనసు

ఇట్టి అమానుష హత్యాకాండను తను బలపరచాలా....?

కాని, అసలు తను వాళ్ళతో కలిసిపోయి, వాళ్ళనే అహింసామూర్తులుగా మలచగలడా తను మానవజాతి పరిణామక్రమంలో ఎన్ని పరివర్తనలు జరగలేదు గనక....

శంకరం మాష్టారు ఆలోచనలకు హఠాత్తుగా తెరపడింది...

"శంకరం మాష్టారు — జిందాబాద్"

'శంకరం మాష్టారి నాయకత్వం — వర్ధిల్లాలి"

"గ్రామం అంతటా వినవచ్చేటట్టు నినాదాలు హోరెత్తించారు.

శంకరం మాష్టారు తెల్లబోతూ చూస్తుండగానే—

"తమ వడ్డీ వ్యాపారంతో అమాయకుల మూల్గులను పీల్చే దేశద్రోహులకు బంగార్రాజు గతేపడుతుందని హెచ్చరిస్తున్నాం. ఇట్లు శంకరం మాష్టారి దళం" అని బంగార్రాజు రక్తంతోనే అట్టమీద వ్రాసి ఆ ఇంటిగొళ్ళానికి తగిలించారు తీవ్రవాదులు. అది చూసిన శంకరం మాష్టారి కళ్ళు తిరిగిపోయాయి.

వీధులలో నాలుగు బాంబులు పేల్చి, శంకరం మాష్టారుతో సహా అడవులలోకి పరారయ్యారు తీవ్రవాదులు. వడ్డీవ్యాపారి బంగార్రాజు తల నరికినంత మాత్రాన దేశంలో వడ్డీ వ్యాపారం ఆగిపోతుందా? ఈ రోజు బంగార్రాజు రేపు ఇంకొక ఊరిలో ఏ వీరయ్యనో చంపుతారు. ఇలా ఎంతమందిని చంపడం. చంపినంత మాత్రాన తీవ్రవాదం ముందుకు వెళ్ళుతుందా? వడ్డీ వ్యాపారస్తులకు, భూస్వామి పెత్తందారులను ఇంకా తదితర వర్గ శత్రువులను చంపడమే తీవ్రవాదుల హేతువా? ఈ పైశాచిక చర్యలకు అంతంలేదా? తీవ్రవాదులకు తీవ్రవాదం అంటే ఏమిటో పూర్తిగా అవగాహన కాలేదు. ప్రజలను భయపెట్టి ప్రజాపోరాటం సాగించడం సబబుకాదు. విప్లవానికి అనుకూల పరిస్థితులు లేనపుడు వున్నట్లుగా ఊహించుకోవడం ఆ ఊహనే గుడ్డిగా నమ్మడం ఇతరులను నమ్మించడం ఏ మాత్రం తీవ్రవాదుల పురోగభివృద్ధికి సరియైనది కాదు. హింస సరియైన మార్గం కాదు. శంకరం మాష్టారు అనుకోని పరిస్థితుల్లో బందికాబడ్డారు. తనను బంధీచేసిన తీవ్రవాదులకు వారు చేస్తున్న హింస సహించరానిది అని తెలియచెప్పితే తన ప్రాణాలకే ముప్పు. అటు ప్రభుత్వం దృష్టితో తన తీవ్రవాద నాయకుడు, తనను కూడ ఎప్పుడో ఎదురు కాల్పుల్లో చంపుతారు. చావటానికి తను సిద్ధంగా ఉన్నాడు. కాని తన ప్రయత్నము అలాగే ఉండిపోతుంది. మానవతకు పట్టాభిషేకం ఎప్పుడు? ఇప్పుడు ప్రభుత్వం దృష్టిలో ప్రజల దృష్టిలో శంకరం మాష్టారు తీవ్రవాదుల దళం నాయకుడు ఆయన నాయకత్వానే హత్యలు.

శంకరం మాష్టారు తలకు వెల కట్టారు పోలీసులు పట్టిచ్చిన వారికి...

శంకరం మాష్టారు కృంగిపోయాడు. మానసికంగా మరణిస్తున్నాడు.

శంకరం మాష్టారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

తీవ్రవాదులతో కలసిపోవడమో, పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోవడమో....?

శంకరం మాష్టారు ఇప్పుడొక లోలకం.

మానవకార పెండ్యూలం....



## 'బెడ్ రూం సీన్'

పహచాన్ చిత్రంలో ముద్దు సీనుకు ఒప్పుకోని 'శిల్పా శిరోద్కర్' బ్రహ్మాండమైన పడక సీనులో నటించాల్సి వచ్చింది. ఆ చిత్రంలోని హీరో 'సైఫ్ అలీ ఖాన్' ముఖం నచ్చలేదేమో, ఆ పడక సీనును చెయ్యనని మొండికేసింది. చివరికి ఆమెను తప్పించే పరిస్థితి వచ్చేసరికి ఒప్పుకుంది. నాలుగు నిమిషాల పాటు సాగే పాట మొత్తం పడక మీద వారిద్దరి 'పాట్లు' చూసిన వారు మనసు పాడు చేసుకోక మానరని అంటున్నారు.

Edited Printed and Published by D. Bheem Reddy for Kakatiya Publications, 5-8-55/
Nampally Station Road, Hyderabad-500 001. Phone: 201181.
Madras Phone: 8252940.